ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 14 సంచిక : 01 సెప్టెంబరు 2008

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ............ 15-05-08

మహేంద్రవాడ ...... 08-06-08

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## మనస్సే మహాజాడ్యం – గురువే ఆ రోగానికి వైద్యుడు

మనస్సు ద్వంద్వాలతో గుర్తింపబడే ప్రపంచానుభవాన్ని ప్రసాదిస్తుంది. ప్రపంచాన్ని చాపలా చుట్టి ప్రక్కనపెట్టాలి. మనస్సును ఆపాలి. మొదటి విషయం "నేను" మనస్సును కాను కాబట్టి చిరాకు, మోహం నాకు లేవని నిశ్చయించుకొని ఆ జాడ్యం నుంచి బయట పడాలి. దానికి గురు సంబంధం అవసరమని శాస్త్రం నిరూపిస్తున్నది. కష్టానికి హేతువు మనస్సు యొక్క దుర్భోదే. జయించని మనస్సు ప్రభల శత్రువు. సంస్కారాలను పూర్తిగా నిర్మూలించటం గురు కటాక్షం ద్వారానే జరుగుతుంది. శిష్యుని యొక్క జుగుప్స, మోహాలనే అష్టపాశాలను గురువు దయ అనే ఖడ్గము యొక్క దెబ్బలచేత ఖండింపబడి ఆనందమును కలుగజేస్తారు. గురువుకు మన మానసిక రోగాలు గాజు సీసాలో వస్తువులు కనబడినట్లు కనబడతాయి. గురువునుంచి వట్టి చేతులతో రారు. పవిత్ర భావాలతో తిరిగివస్తారు. పూర్ణగురువుల సాంగత్యం ద్వారా మాత్రమే స్వచ్ఛమైన ప్రేమ రాగలదు. ప్రేమే నిజమైన పూజ అది వినయాన్ని కలిగించి తాను ప్రేమించే గురువు ఇష్టానుసారంగా జీవించటం భోదిస్తుంది. ఇది ప్రపంచ సౌఖ్యాలను, బాధలను నిర్లక్ష్యం చేసేలా చేస్తుంది. సంవత్సరాల తరబడి చేసే పూజ, జపాలు గురుప్రేమ లేకపోతే ఫలవంతం కావటం కష్టం. అంతరంగ ఆనందం లేశమైనా లేనప్పుడు వివిధ శాస్త్రజ్ఞానం అజ్ఞానం యొక్క అజ్ఞానం అంటారు. నేను ఇతరులు అనేది లేదు. అందరూ నేనే అనే అవగాహన కుదరాలి. మన మనస్సు ఎన్నో ఊరించే విషయాలను కల్పిస్తుంది. అది మహా అయస్కాంతం. దాన్ని మహాగురువు ఎటూ వెళ్ళకుండా కంచెవేసి క్షేమంగా ఉండేలా చేస్తారు. మన చెయ్యి వారి

చేతిలో ఉంచితే ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో ఆయనకు బాగా తెలుసు. గురవు బోధిస్తున్న విషయాన్ని ప్రీతిగా స్వీకరిస్తూ అర్థం చేసుకొని అంచెల అంచెలగా ఎదిగి గురువు మౌనంతో అందించే సత్యాన్ని అందుకొనే సామర్థ్యాన్ని సంపాదించుకొంటాడు. ఆ సత్య బోధసాదకుని అవ్యక్తంలోకి చేరుస్తుంది. గురువుపట్ల అచెంచల విశ్వాసం ఉండాలి. శ్రీ నాన్నగారు "జ్ఞానితో సహవాసం వల్ల ఆధ్యాత్మిక, భౌతిక ఐశ్వర్యాలు రెండూ కలుగుతాయి. మన ప్రయత్నమే అనుగ్రహంగా వస్తుంది" అన్నారు. మన ప్రయత్న మంతా గురు పాద పంచకంపై పరిపూర్ణ ప్రేమతో దృష్టిని నిలపటమే దానితో మనోజాడ్యం మటుమాయమై అన్ని కోరికలు నెరవేరిన పూర్ణశాంతిని పొందుతాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 15-05-08, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్మసిద్ధాంతం మీరు బాగా అర్థం చేసుకోవాలి. మనం ఏ పని చేసినా నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధితో పని చేస్తాము. అంటే మనం బేధంతో కూడిన పని చేస్తాము. అది ద్వైతకర్మ. బేధబుద్ధితో పని చేయటం వలన మనకు కోపం వస్తుంది, ద్వేషం వస్తుంది. ఇవన్నీ బేధబుద్ధిలో నుండే వస్తాయి. అద్వైతానుభవం పొందినవాడు మాత్రమే అద్వైతకర్మ చేయగలడు. అద్వైతానుభవం పొందాక నువ్వు ఏ కర్మ చేసినా అది నిన్ను ముట్టుకోదు, అది నిన్ను బంధించదు. బేధబుద్ధితో మీరు పని చేస్తున్నారు అనుకోండి మీరు మంచి పని చేసారు అనుకోండి ఇప్పడుకాకపోయినా పదిజన్మల తరునాత అయినా ఆ మంచి సుఖరూపంలో వస్తుంది. మీరు ఏదైనా చెడ్డ పనిచేసారు అనుకోండి, అది మీకు దుఃఖ రూపంలో వస్తుంది, మంచికి మంచి, చెడ్డకు చెడ్డ మీరు అనుభవించవలసిందే గాని మంచి చెడ్డను కేన్సిల్ చేయదు, చెడ్డ మంచిని కేన్సిల్ చేయదు. మీరు రూపాయికి 99 పైసలు మంచి చేసారు అనుకోండి, ఒక పైసా చెడ్డ చేసారు అనుకోండి. ఆ 99 పైసలు మీకు సుఖరూపంలో వస్తుంది, ఒక్క పైసా దుఃఖరూపంలో వస్తుంది. అవి మీకు అనుభవంలోనికి వచ్చాక రెండూ బయటకు పోతాయి అంతేగాని 99 పైసలు మంచి, ఒక పైసా చెడ్డను తీయలేవు, అది దీనిని కేన్సిల్ చేయలేదు, రెండూ అనుభవించవలసిందే, ఇది కర్మసిద్ధాంతం. రైలు పట్టాలు కలవవు, దేనికి అదే. అలాగే మంచి, చెడ్డ దేనికి అది నీవు అనుభవించవలసిందే. లోకంలో రకరకాల కర్మలు చూస్తున్నాము కదా. కొంతమందికి వెయ్యి ఎకరాల పొలం ఉంటుంది. చేసిపెట్టేవారు ఉంటారు, ఏమి తిన్నా అరగదు.

కొంతమందికి ఏమి తిన్నా అరుగుతుంది కాని పెట్టేవారు ఉండరు. అంటే మనం జన్మాంతరంలో చేసుకొన్నది కాలప్రవాహంలో అనుభవంలోనికి వస్తుంది. మంచికి మంచి, చెడ్డకు చెడ్డ అనుభవంలోనికి వచ్చి బయటకు పోవటం వలన వాడి బుద్ధి శుద్ధి అవుతుంది. ఉన్నది భగవంతుడే, ఆయనకంటే భిన్నంగా ఏదీ లేదు. ఆయనకంటే భిన్నంగా ఏది కనిపించినా అది నిజం కాదు. మనకు బేధబుద్ధి రావటానికి దేహం మీద ఉన్న మోహం కారణం.

మనం సజ్జనసాంగత్యం చేస్తూ, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. పాండిత్యం సంపాదించటం కంటే, అధికారం సంపాదించటం కంటే, ధనం సంపాదించటం కంటే మనలో మనం మార్పు తెచ్చుకోవటం అంటే మారుమనస్సు పొందటం చాలా కష్టం. మనం విశ్వాస పాత్రులంకాదు. భగవద్గీత రోజూ చదువుతాము కాని గీతలో చెప్పిన వాక్యాలను మనం నమ్మము. నమ్మితేనేగాని ఆ వాక్యం మీద మనకు విశ్వాసం కలుగదు, విశ్వాసం కలగకపోతే అది మన మనస్సులో మార్పు తీసుకొని రాలేదు. మన జీవితవిధానంలో మార్పు రావాలంటే, మారుమనస్సు పొందాలంటే భగవంతుడు చెప్పిన వాక్యం యందు మనకు విశ్వాసం ఉండాలి ప్రేమ ఉండాలి. అప్పుడు అది మన మీద పని చేయుటం ప్రారంభిస్తుంది, అప్పుడు సమూలంగా మారుమనస్సు పొందుతాము, అప్పుడు ఈ శరీరం ఉండగానే చనిపోయి మరల పుడతాము, అది ద్విజన్మ, అంటే ఈ శరీరం ఉండగానే కొత్తజన్మ పొందుతాము. మనస్సును నిగ్రహించుకొందామని అనుకొంటున్నాము కాని తలంపులు ఆగటం లేదు అని చెపుతూ ఉంటారు. గడియారానికి కీ ఇచ్చేసి ముల్లును ఆగమంటే ఎలా ఆగుతుంది. మనలో దేహము నేను అనే తలంపు ఉంది, మనకు తలంపులు పెరగటానికి అదే కారణం. బ్యాటరీ అయిపోతే గడియారం ఎలా ఆగిపోతుందో అలాగే దేహము నేను అనే తలంపు పోతే ఇంక ఏమీ లేదు. తలంపులు వచ్చేస్తున్నాయి, వాటిని ఆపుచేసుకోవటం ఎలాగ? దానికి ఏమి చెప్పారు అంటే మీకు ఇష్టమైన దేవుడి రూపాన్ని ధ్యానం చేసుకో, ఆయన నామాన్ని స్మరించుకో. నీ మనస్సు వాటిని పట్టుకొని ఉండటం వలన దానికి వచ్చే ఇతర తలంపులు ఆగిపోతాయి.

మీ మనస్సు, మాట, చేత నిదానంగా ఉండాలి. ఆలోచనలో వంకర ఉండకూడదు, మాటలో వంకర ఉండకూడదు, చేతలో వంకర ఉండకూడదు. మీరు ఏదైనా మంచి పనిచేస్తున్నా కూడా అది మంచి సంకల్పంతో చేయాలి. మన మనస్సులో వచ్చే ఆలోచనలు ఎలా ఉంటున్నాయో ఏ రోజుకారోజు పరిశీలన చేసుకోవాలి. మన సాధనకు అనుకూలమైన తలంపులు వస్తున్నాయో, వ్యతిరేకమైన తలంపులు వస్తున్నాయో అనేది జాగ్రత్తగా చూసుకోవాలి.

మన సాధనకు అనుకూలమైన తలంపులు వస్తూ ఉంటే వాలుగాలిలో సైకిలు తొక్కినట్లుగా మన ప్రయాణం వేగంగా సాగిపోతుంది, సాధనలో తొందరగా సక్సెస్ అవుతాము. ప్రతికూలమైన తలంపులు వస్తూ ఉంటే సాధన ఆగిపోతుంది. ఒకోసారి మనకు ఉపయోగం లేని తలంపులు వస్తూ ఉంటాయి, ఇటువంటి తలంపులు వస్తున్నాయి ఏమిటి అని మనకు అనిపిస్తుంది. ఒకప్పుడు అవి మంచివి అని అలవాటు చేసుకొన్నాము కాబట్టి అవి వచ్చేస్తూ ఉంటాయి. భగవంతుడు చెప్పిన మాటలు విన్నాక అవి మంచివి కాదు అని మనకు అర్థమయ్యింది. అందువలన అవి వచ్చినప్పుడు వాటిని ఆచరణలో పెట్టకుండా ఉంటే అవి నెమ్మదిగా పల్చబడి రాలిపోతాయి. మాట విషయంలో, ఆలోచన విషయంలో, చేత విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందులోను ఆడంబరం పనికిరాదు. మీరు పదివేల రూపాయల చీర కట్టుకొని, పది లక్షల రూపాయల కారులో కూర్చొని గుడిసెల దగ్గరకు వెళ్లి మేము మీకు సేవ చేయటానికి వచ్చాము అంటే ఆ మాటలకు అర్థం ఉందా? అవి సేవ చేసే బుద్ధి ఉన్నవాడు చేసే పనులేనా? సేవ చేయటానికి వెళుతున్నారా లేక మీ అహంకారాన్ని చూపించటానికి అక్కడకు వెళుతున్నారా? మీకు వందకోట్లు డబ్బు ఉంటే దాచుకోండి కాని సాధకులకు ఆడంబరం పనికిరాదు. మనకు రీజినబుల్ కంఫర్ట్సు ఉండవచ్చు కాని అతి పనికిరాదు. మీరే ధనవంతులని వంటినిండా, మెడనిండా వస్తువులు పెట్టేసుకోవటం చివరకు ఉన్న అందం పోతుంది, గంగిరెద్దుల్లా తయారవుతారు. ఏది కూడా ప్రదర్శన పనికిరాదు. మీకు మంచితనం ఉంది అనుకోండి, మంచివారు కింద ఇతరులకు కనబడకూడదు. మీ మనస్సును బాగుచేసుకోవటానికే ఈ సమావేశాలు అన్నీ.

మీకు ఇష్టమైన భగవంతుడి నామాన్ని నిరంతరం స్మరించటం వలన మీకు అవసరంలేని తలంపులు ఆగిపోవటమే కాకుండా, మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, దానిని నామ సాధన అంటారు, నామాన్ని చేయటం వలన కూడా తరించిన వారు ఉన్నారు. మన శరీరం ఇప్పుడు ఈ ప్రకృతిలో ఉండగానే ప్రకృతి గుణాలు లేకుండా ఎవడైతే ఉండగలుగు తున్నాడో వాడే జ్ఞాని. ప్రకృతిలో ఉండగానే ప్రకృతి గుణాలు లేనివాడికి అసలు ఏమీ అనిపించదు. జ్ఞాని స్థితి అటువంటిది. మిమ్మల్ని ఎవరైనా మంచివారు కాదు అంటే మీరు కంగారుపడిపోతారు. మేము మంచివారము అని చెప్పటానికి మరల గంటసేపు చెపుతారు. రామకృష్ణ పరమహంసగారు వాళ్లకు మంచివారము అని మీచేత చెప్పించుకోవలసిన అవసరం వారికి లేదు ఎందుచేతనంటే ఇవన్నీ మనస్సు యొక్క గొడవలు. ఎప్పుడో ఈ

మనస్సును దాటి వెళ్ళిపోయారు వారు అందుచేత ఇటువంటి గొడవలు వారికి అక్కరలేదు. వారికి ఈ ప్రపంచం అంతా గడ్డిపరకతో సమానము. కర్మసన్యాసం అంటే మొత్తం కర్మను విడిచిపెట్టేయటం కాదు, నువ్వు కర్మను చేస్తూ దాని తాలుక ఫలితంలో కనీసం కొంతభాగం అయినా సమాజానికి సమర్పించటం. కర్మఫలత్యాగి సన్యాసి, కర్మ మనలను విడిచిపెట్టాలికాని మనం కర్మను విడిచిపెట్టలేము. బ్రాహ్మీస్థితి పొందినవాడినే కర్మ విడిచిపెట్టేస్తుంది కాని అంతవరకు ఏదో రకమైన కర్మ వెంటాడుతుంది. జన్మాంతరంలో పుణ్యం ఉంటేగాని, ఎంతో పూర్వజన్మ సుకృతం ఉంటేగాని ఈశ్వరుని పాదాలయందు మనకు భక్తి కలుగదు. ఆ భక్తి కుదిరితే, ప్రేమ కుదిరితే నెమ్మదిగా మనోనాశనం ప్రారంభమవుతుంది.

బ్రహ్మానుభవం మనకు కలుగుతుందా లేదా అని అనుమానం పెట్టుకోవద్దు, అందరికీ వస్తుంది ఎందుచేతనంటే మీరు అందరూ ఆ రైలులో కూర్చొన్నారు. భక్తిలేకుండా ముక్తి రాదు అయితే మనది భక్తికాదు. ఏదో కోరిక పెట్టుకొని గుడికి వెళతాము, కోరికతో దేవుడిని స్మరిస్తాము. కోరికలు దృష్టిలో పెట్టుకొని యజ్ఞయాగాలు చేస్తాము. వీటివలన మీ కోరికలు నెరవేరవచ్చుగాని భగవధనుభవం మటుకు కలుగదు. మీకు ఏ రకమైన కోరిక ఉండకూడదు, భగవంతుడి మీద భక్తి నిలబడి ఉండాలి అప్పడు మీకు ముక్తి కలుగుతుంది. మీకు నాకు ఈ పంచభూతాలకు అతీతంగా ఒక శక్తి ఉంది. మొత్తం సృష్టినంతా ఆ శక్తే నడుపుతోంది. ఆ శక్తియందు మనకు విశ్వాసం ఉంటే, భక్తి ఉంటే అదే లోపల నుండి మనలను గైడ్ చేస్తుంది, దానిని ఎలా పొందాలో అదే మనకు దారి చూపిస్తుంది. ఏవో పనులు నెరవేరటానికి భగవంతుడిని ఉపాయంగా పెట్టుకొన్నాముగాని ఆయనను గమ్యంగా పెట్టుకోవటం లేదు అందుచేత మనకు జ్ఞానం రావటంలేదు. ధనం సంపాదించటం కంటే, పాండిత్యం సంపాదించటంకంటే మీకు పది వాసనలు ఉంటే అందులో ఒక వాసనను విడిచిపెట్టటం చాలా కష్టం. ఈ వాసనలు దేనికి వస్తున్నాయి అంటే దేహము నేను తలంపుకు వస్తున్నాయి. దేహము నేను అనే తలంపు మీరు కాదు. మీరు ఏదైతే కాదో దానికి అవి వస్తున్నాయి, ఈ డస్టు అంతా దానికే వస్తోంది. అది మీకు అర్థమవుతూ ఉంటే వాసనల యొక్క వేగం తగ్గిపోతుంది. కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలలో మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చేయండి కాని కపటం ఉండకూడదు. కుయుక్తుల వలన, కుతంత్రాలవలన మనుషలను మాయ చేయగలం కాని భగవంతుడిని మాయ చేయలేము.

మన మనస్సు మంచిగా ఉంటే మంచి పనులు చేయగలము, మంచి మాట్లాడ గలము, మంచిగా జీవించగలము. అందుచేత మనస్సును బాగుచేసుకోవటం కంటే మించిన పని లేదు. మనస్సు బాగుపడితే, మనస్సు పవిత్రం అయితే అది ఎక్కడ నుండి అయితే వచ్చిందో అక్కడకు వెళ్ళిపోతుంది. అది ఎక్కడనుండి వస్తోంది అంటే హృదయంలో ఉన్న భగవంతుడి దగ్గర నుండి వస్తోంది అక్కడకు వెళ్ళి ఐక్యమైపోతుంది. నీకు భక్తి అవసరమే. ఎంతభక్తి అవసరం అంటే ఆ భక్తిలో నీ మనస్సు కరిగిపోవాలి. మనస్సుకు ఏదో కుయుక్తులు నేర్పి దేవుడి దగ్గరకు పంపుదాం అనుకోవద్దు. అది పవిత్రమైతే, ఏకాగ్రం అయితే మీ ప్రయత్నం అక్కరలేదు, దానంతట అదే మీకు తెలియకుండానే వెళ్ళి హృదయసాగరంలో కలిసిపోతుంది. మన కళ్ళకు కనిపించే దానికంటే కళ్ళకు కనిపించనిదే ఎక్కువ నిజం అని భగవాన్ అన్నారు. మన దేహం ఇంద్రియాలు ఇవి అన్నీ మన కళ్ళకు కనిపిస్తున్నాయి కాని అవి నిజం కాదు. మన లోపల దేవుడు ఉన్నాడు ఆయన మన కళ్ళకు కనబడటం లేదు కాబట్టి ఆయన నిజం కాదు అనుకొంటున్నావు కాని ఆయనే నిజం. సృష్టి నిజం కాదు. ఏ పరమాత్మ అయితే ఈ సృష్టికి కారణంగా ఉన్నాడో వాడు మాత్రమే నిజం. మనకు రూపదృష్టి, నామదృష్టి పోతే, మనలో ఉన్న వేరుబుద్ధిని తీసేస్తే ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు గోచరిస్తుంది. మన హృదయంలో ఒక సత్యం ఉంది, పరమాత్మ ఉన్నాడు. ఈ దేహముతోగాని, లోకంతోగాని, జనన మరణములతో గాని సంబంధం లేకుండా ఉన్నాడు, ఆయన కోపం లేకుండా ఉన్నాడు, ద్వేషం లేకుండా ఉన్నాడు. ఆయన ఎలా ఉన్నాడో మనం కూడా అలా ఉండగలిగితే మనం వాడికోసం ఎదురుచూడనక్కరలేదు, వాడే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. దేహగతమైన నేను ఉన్నంతసేపు ఏ జీవుడిని స్వార్థం విడిచిపెట్టదు. ప్రపంచంలో ఇంతవరకూ ఏ స్వార్థపరుడికీ ఆత్మజ్ఞానం కలుగలేదు.

భగవంతుడు గీతలో చెప్పిన మాటలు అవి మీకు అనుభవంలోనికి వస్తే అవి ఎంత నిజమో మీకు తెలుస్తాయి. అనుభవంలోనికి వస్తే ఇంక విశ్వాసంతోటి, నమ్మకంతోటి పనేముంది. మనకు అనుభవం లేదు కాబట్టి నమ్మకం మీద ఆధారపడాలి. ఆ నమ్మకంలో కూడా కపటం ఉండకూడదు. మోక్షసుఖం కోసం మీ శరీరం చనిపోయేవరకు ఆగనక్కరలేదు. ఇప్పడే వచ్చేస్తుంది. మీకు విషయచింతన తగ్గుతూ ఉంటే, దైవచింతన పెరుగుతూ ఉంటే, మీకు లోచూపు కలుగుతూ ఉంటే మోక్ష సుఖం ఇప్పడే మీకు అందుతుంది, అయితే మీరు విశ్వాసపాత్రులు అయి ఉండాలి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని

ఆయన పట్ల మనకు ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి, విశ్వాసం ఉండాలి. అప్పుడు మీరు పొందవలసింది ఏదో ఈ జన్మలోనే పొందుతారు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఆయన ప్రణాళిక ప్రకారం ఈ సృష్టి నడుస్తుంది. అది మనకు తెలియకపోవటం వలన, మనం అనుకొన్నట్లు జరగలేదు కాబట్టి మనకు అశాంతి వస్తూ ఉంటుంది. ఎవడినైనా ఉద్ధరించటానికిగాని, పాడుచేయటానికిగాని నువ్వు ఎవడవు? నువ్వు అంటూ అసలు ఉన్నావా? ఇదంతా ఎందుకు చెపుతున్నాను అంటే మొన్న ఎవడో వచ్చి లోక కళ్యాణం కోసం అక్కడ ఏదో చేస్తున్నాను అని చెపుతున్నాడు. వాడి మనస్సులో కళ్యాణం లేదు, శాంతి లేదు. లోకం కోసం ఏదో చేస్తాను అంటే దానికి అర్థం ఏమిటి? అసలు మీలో ఏమీ లేనప్పుడు మీరు ఇతరులకు ఏమి ఇవ్వగలరు. బ్రహ్మం నిరాకారం, నిర్గుణం. అది ఏ వ్యక్తిలో అయితే వ్యక్తమైందో అక్కడ సగుణంగా, సాకారంగా ఉంటుంది. జ్ఞాని సాకారదైవం.

మీరు ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. మీ శరీరాలు ఎక్కడ ఉన్నా, మీ మనస్సు భగవంతుడి మీద ఉండాలి. శరీరం ఎక్కడ ఉంది అనేది ప్రధానం కాదు, మనస్సు ఎక్కడ ఉంది అనేదే ప్రధానం. మన మనస్సుతో మనం విరోధం పెట్టుకోకుండా, మన మనస్సును బాగు చేసుకొని మనస్సుతోటే పొందేది ఏదో పొందాలి అంటే మనలను మనం బాగుచేసుకోవాలి కాని ఎవరో వచ్చి బాగుచేస్తారు అని కనిపెట్టుకొని ఉండకూడదు. లోకాన్ని అనుసరించవద్దు. ఇతరులను ఉద్ధరించటం మాట వదిలేయండి, మనస్సులో ఇతరుల క్షేమం కోరేవారు సమాజంలో ఎంతమంది ఉన్నారు. మీరు ఎండలో ఉంటే ఇక్కడ నీడగా ఉంది వెళ్ళి ఆ నీడలో కూర్చోమని చెప్పేవారు ఎంతమంది ఉన్నారు. మీరు ఏదైనా రంగంలో అభివృద్ధిలోనికి వస్తున్నారు అనుకోండి. మీ వెనకాల అసూయ పడేవారు వెయ్యిమంది ఉంటారు. ఏమిటి ఇలా అసూయ పడుతున్నారు, వారికి మనం ఏమీ అపకారం చేయలేదు కదా ఎందుకు అసూయపడుతున్నారు అని మీరు అనుకోకూడదు. అది లోకం యొక్క పోకడ, ఈ లోకం అంతే అలాగే ఉంటుంది. లోకం బాధ మనం ఎలాగా తీర్చలేము, మీకు ఏదైనా బాధ ఉంటే అది మాత్రం లోకానికి పంచిపెట్టకండి అని చలంగారు అనేవారు. లోకం యొక్క బాధను మీ బాధగా చేసుకోలేకపోయినా మీ బాధను మాత్రం లోకబాధగా చేయకండి అని చెప్పటం. ఇతరుల బాధను నువ్వు పట్టించుకోకపోతే వదిలేయి, నీ బాధను అందరికీ పంచిపెట్టకు అది చలంగారు చెప్పేది. ఏది ఎప్పుడు ఎలా జరగాలో అలా జరుగుతుంది, నీ మనస్సును మటుకు ఈశ్వరుడి పాదాలయందు ఉంచి నువ్వు ఊరక ఉండు. భగవంతుడు నిన్ను

ఎక్కడ కూర్చోబెట్టినా అది భగవంతుడి సంకల్పం అనుకో. నీ గురించి నీవు ఏమీ తలంపులు పెట్టుకోవద్దు. నీకు ఏది మంచిదో నీకంటే భగవంతుడికి బాగా తెలుసు.

చెప్పటానికి ఏముంది అని ఎవరయిన అంటే అవి పిచ్చి మాటలు. చెప్పటానికి ఏమి లేకపోతే కృష్ణుడు గీత ఎందుకు చెప్పాడు, శంకరుడు వివేకచూడామణి ఎందుకు చెప్పాడు, రమణమహర్షి రమణభాషణలు ఎందుకు చెప్పారు. దక్షిణామూర్తి మౌనం అంటే మన మౌనం కాదండి. నోరుమూసుకుని కూర్చోవటం మౌనంకాదు మనస్సు ఆత్మాకారం చెందినప్పుడు ఆ మౌనం ఆత్మలోనుండి వస్తుంది. దక్షిణామూర్తి మౌనాన్ని మీరు అర్థం చెసుకోగలరా. అర్థం చేసుకోలేరు అందుకే శంకరుడు చెప్పారు, భగవాన్ చెప్పారు. మౌనం ద్వారా అర్థం చేసుకొనేశక్తి మీకు ఉంటే ఇవన్నీ చెప్పనక్కరలేదు. ఎంతమంది మౌనాన్ని అర్థం చేసుకోగలరు. ఏ వస్తువును తెలుసుకోవటానికి మీరు వింటున్నారో, మీరు జపధ్యానములు చేస్తున్నారో దానిని పొందాక ఆ స్థితిలో మీరు చూడటానికిగాని, వినటానికి ఏమీ ఉండదు. ఆ స్థితిలో మీకు వచ్చేదీలేదు, పోయేదీలేదు, మీరు సముద్రంలా ఉంటారు. ఈ లోకం అంతా ఈశ్వర స్వరూపం అనే భావనతో పనిచేస్తే అది ఈశ్వర సేవ అవుతుంది. ఈ జీవుడిలో కూడా శివుడిని చూస్తూ మీరు సేవ చేస్తే అది పూజ అవుతుంది, అది మిమ్మల్ని బంధించదు. మన మాటలో, పనిలో, ఆలోచనలో చిత్తశుద్ధి ఉండాలి. చిత్తశుద్ధి ఉంటే మీకు మోక్షం వచ్చేస్తుంది. శివుడికి పూజలు చేస్తూ మీ చిత్తం చెప్పలమీద ఉంటే ఎలాగ? సాధారణంగా మనం గుడికి వెళ్లినప్పుడు చెప్పలు బయట విడిచిపెట్టి లోపలకు వెళతాము. మీ చేతులు పూజ చేస్తూ ఉంటాయి, మీ చిత్తం చెప్పల మీద ఉంటుంది. పూజ చేసి వెళ్ళేటప్పటికి మన చెప్పలు ఎవరైనా పట్టుకుపోతారేమో అనుకొంటాము, అటువంటి పూజలు ఎందుకు? చిత్తశుద్ధి లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు.

భగవంతుడు మనకి ఇంకో ఉపాయం చెపుతున్నాడు. మనుషులు రకరకాలుగా ఉంటారు, శరీరాలు రకరకాలుగా ఉంటాయి, మనస్సులు రకరకాలుగా ఉంటాయి, ఇవి ఏమీ చూడవద్దు. మీకు బయట చూపు వద్దు, లోపల చూపే ఉండాలి. ఎవరిని చూసినా అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడినే చూడండి. ఈ సృష్టికి మూలం నేను అనే మూలతలంపు. ఈ మూలతలంపు హృదయంలోనుండి వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక మనస్సు వస్తోంది. మనస్సు వచ్చాక దేహం వస్తోంది. దేహం వచ్చాక లోకం వస్తుంది, లోకం వచ్చాక

